
# జాతకచక్రం

– కోడూరి శేషఫణిశర్మ



''ఏమండీ!'' పిలిచింది శారదమ్మ వంటకి కూరగాయలు సిద్ధం చేసుకుంటూ. ''ఏమిటీ!'' పేపర్లోంచి తలెత్తకుండానే అడిగాడు సత్యమూర్తి.

''ఈ ఆదివారం సిద్ధాంతిగారింటికి వెళ్లొస్తానన్నారు'' కాస్త నిష్టూరంగానే అంది శారదమ్మ.

రెండు మూడునెలలుగా శారదమ్మ పోరు పెడుతూనే వుంది వాళ్ళమ్మాయి గాయత్రిని సిద్ధాంతిగారబ్బాయి కృష్ణప్రసాద్‌కి అడగమని. నిజమే! సిద్ధాంతిగారి సంబంధం అన్నివిధాలా బాగుంటుంది. ఆయన స్టేట్‌బ్యాంక్‌లో ఆఫీసరు. ఆధునిక భావాలతోపాటు సనాతన ధర్మాలమీద ఆసక్తికలవాడు. జ్యోతిష్యం, ఆయుర్వేదంలాంటి వాటితోపాటు బ్యాంకు సిబ్బందిలోనూ, అటు ఊళ్ళో పై తరగతివారిలోనూ మంచి పేరు తెచ్చుకున్నారు. ముఖ్యంగా జాతకాలు బాగా చూస్తాడని, దోషాలు ఏమైనా వుంటే చిన్న చిన్న పూజలు, శాంతులు సూచిస్తాడని చెప్పుకుంటారు. సిద్ధాంతిగారబ్బాయి కృష్ణప్రసాద్ హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో ఇంజనీర్‌గా వున్నాడు. మంచి జీతం. అన్నివిధాలుగా అనువైన సంబంధంగా తోచింది శారదమ్మకు. అందుకే వాళ్ళాయనని పోరుతోంది 'సిద్ధాంతిగారి దగ్గర మన అమ్మాయి ప్రస్తావన తీసుకురండీ!' అంటూ.

సత్యమూర్తికి కూడా బాగుంటుందనే అనిపిస్తోంది. కానీ అయినకున్న అనుమానం ఆయనకు ఉండనే ఉంది. అసలే సిద్ధాంతిగారి సంబంధం. అమ్మాయి జాతకం... ఆయన ఒప్పుకుంటారో లేదో! తీరా అడిగి లేదనిపించుకుంటే బాగుండదు. పైగా సిద్ధాంతిగారు కాదన్న జాతకాన్ని మరొకరు ఒప్పుకోకపోవచ్చు కూడా. అన్నీ కుదిరినా కట్నం వగైరాల విషయంలో ఆయన అభిప్రాయమేమిటో? ఇలాంటి అనుమానాలతో ఇన్నాళ్ళూ తటపటాయిస్తూ వచ్చాడు సత్యమూర్తి.

చదువుతున్న పేపరు మడిచి పక్కన పడేసి మనసులోని అనుమానాన్ని బయటపెట్టాడు. ''రాసి పెట్టి వుంటే తీసివేయలేం. ప్రాప్తం అంటూ లేకపోతే వెంటపడినా కుదరదు. ఈ రోజే వెళ్లిరండి'' అంది శారదమ్మ.

• • •

ఆ రోజు సాయంత్రమే సిద్ధాంతిగారింటికి బయలుదేరాడు సత్యమూర్తి. అమ్మాయి జాతకచక్రం జేబులో పెట్టుకున్నాడు. దారిలో పూలూ, పళ్ళు కొన్నాడు.

సత్యమూర్తి వెళ్లే సమయానికి సిద్ధాంతిగారు ఎవరివో జాతకాలు పరిశీలిస్తున్నారు. సత్యమూర్తి రాకను గమనించి చిరునవ్వుతోనే ఆహ్వానిస్తూ కూర్చోవడానికి కుర్చీ చూపించారు సిద్ధాంతి.

''చెప్పండి మూర్తిగారు ఏమిటి విశేషాలు? అంతా బాగున్నారా?'' అంటూ కుశల ప్రశ్నలు వేసారు.

పూలూ, పళ్లు సంచీలోంచి తీసి బయటపెట్టాడు సత్యమూర్తి. తమ అమ్మాయి గాయత్రిని కృష్ణప్రసాద్‌కు ఇవ్వాలనుకుంటున్నట్లు ప్రస్తావన చేసాడు.

''యశోదా! ఇలారా! సత్యమూర్తిగారొచ్చారు చూడు'' అంటూ పూలు పళ్ళు ఆమె చేతికిచ్చి ఆయన ఎందుకొచ్చాడో చెప్పారు సిద్ధాంతి.

''ఎన్నాళ్ళనుండో తెలుసున్నవాళ్ళం. మీ గురించి మేమూ, మా గురించి మీరూ ప్రత్యేకంగా తెలుసుకోవాల్సినవేమున్నాయి మూర్తిగారూ! అబ్బాయి హైదరాబాద్ నుండి రానివ్వండి. వాడు అమ్మాయిని చూచి సరేనంటే ముహూర్తాలు చూసుకుందాం!'' అన్నారు సిద్ధాంతి.

''చాలా సంతోషం సిద్ధాంతిగారూ! అమ్మాయి జాతకం తెచ్చాను. మీ అబ్బాయి జాతకంతో పోల్చి చూసుకోవాలికదా!'' అన్నారు సత్యమూర్తి అమ్మాయి జాతకం జేబులోనుండి బయటకి తీస్తూ.

''జాతకాలదేముంది? అలా వుంచండి. అబ్బాయి అమ్మాయిని చూడాలి. అమ్మాయి అబ్బాయిని చూడాలి. తరువాత విషయాలు తరువాతవి'' అన్నారు సిద్ధాంతి.

ఆశ్చర్యపోయాడు సత్యమూర్తి. సిద్ధాంతిగారేమిటి, జాతకాన్ని గూర్చి అంత తేలిగ్గా అనడమేమిటి? అమ్మాయి అబ్బాయి ఒకరినొకరు ఒప్పుకున్న తరువాత జాతకాలు కుదరలేదంటే ఎలా? కట్నం వగైరాలు కుదరకపోతే సంబంధాన్ని కాదనడానికి జాతకం ఒక సాకుగా చెప్పే వాళ్లెందరో ఉన్నారుకదా! కొంపదీసి అబ్బాయి జాతకంలో ఏదైనా దోషం ఉందేమో? అనుమానం సత్యమూర్తిని కలచివేస్తోంది.

''ఆయన చెబుతున్నారుకదా అన్నయ్యగారూ! అబ్బాయి వచ్చిన తర్వాత మేమే ముందుగా కబురుచేస్తాం. త్వరలో పెళ్లిచూపులు ఏర్పాటు చేద్దాం'' అంది యశోదమ్మ. ''అలాగే! వస్తానండీ'' అంటూ ఇంటి దారి పట్టాడు సత్యమూర్తి. సిద్ధాంతిగారి వ్యవహారమే అంతుపట్టలేదాయనకి.

• • •

పదిహేనురోజులు గడిచాయి. ఒక శనివారం సత్యమూర్తికి కబురు చేసారు సిద్ధాంతి. మరుసటిరోజు దశమీ ఆదివారం సాయంత్రం నాలుగుగంటలకి రాహుకాలం రాకముందే అమ్మాయిని చూడడానికి వస్తున్నామనీ, తగిన ఏర్పాట్లు చేయవలసిందని చెప్పారు. సత్యమూర్తిగారింట్లో హడావుడి మొదలైంది. ''అనుమానాలేవీ పెట్టుకోక రేపటికి కావాల్సిన ఏర్పాట్లేవో చూడండి. అమ్మాయిని చూపిద్దాం'' అంది శారదమ్మ మరురోజు ఏర్పాట్ల గురించి ఆలోచిస్తూ.

• • •

ఆదివారం మధ్యాహ్నం మూడున్నరకల్లా ఆటో దిగారు సిద్ధాంతిగారు, వెనుకగా యశోదమ్మా, ఆవిడ వెంట మరో ముత్తయిదువ దిగారు. తానొచ్చిన స్కూటర్‌కి స్టాండువేసి హుందాగా నడిచాడు కృష్ణప్రసాద్.

మాటామంతీ అయ్యాయి. తేలికపాటి ఫలహారాలు అయ్యాయి. అమ్మాయిని తీసుకొచ్చి కూర్చోబెట్టారు. నీలం రంగు మైసూరు సిల్కుచీర, ముత్యాలహారంతో ముచ్చటగా వుంది గాయత్రి. యశోదమ్మకు తోడుగా వచ్చినావిడ అవీ ఇవీ మాట్లాడింది గాయత్రితో.

కృష్ణప్రసాద్ కళ్లల్లో ఒకరకమైన సంతృప్తి కనిపించింది. సిద్ధాంతిగారు గమనించారు. అబ్బాయిని హాల్లో నుండి వరండాలోకి తీసుకువెళ్లి మాట్లాడారు. యశోదమ్మనూ పిలిచారు. మరో అయిదు నిముషాల తరువాత ''మంచి రోజు చూసుకుని ముహూర్త నిర్ణయం చేసుకోవచ్చునని, లగ్నపత్రికలు రాసుకోవచ్చు''నని చెప్పి బయలుదేరడానికి సిద్ధమయ్యారు.

''జాతకం...'' అంటూ అత్యవసర విషయమన్నట్లుగా గుర్తు చేసాడు సత్యమూర్తి.

''చూడండి సత్యమూర్తిగారూ! జాతకాలపట్ల నమ్మకమున్నవారెవరైనా పెళ్లిళ్ల విషయంలో జాతకాలు చూడనవసరంలేదు'' అన్నారు. అర్థం కాలేదన్నట్లుగా చూసాడు సత్యమూర్తి.

''పెళ్లి కుదిరింది అంటే జాతకాలు కుదిరాయన్నమాటే. చెబుతాను వినండి. మీ జాతకం, మీ ఆవిడ శారదమ్మ జాతకం సరిపోయాయి కనుకనే మీ పెళ్లి జరిగింది. అలాగే మావీనూ. అంటే జాతకాలు కుదిరితేనే పెళ్లిళ్ళు జరుగుతాయి. పెళ్లిళ్ళు కుదిరాయి అంటే జాతకాలు సరిపోయే వుంటాయన్నమాట. అంటే భార్య జాతకం చూచి భర్త జాతకాన్ని ఊహించవచ్చు. భర్త జాతకం ప్రకారం భార్య జాతకాన్ని గణన చేయవచ్చు. మా అబ్బాయి జాతకం నా దగ్గరుంది. ఆ జాతకరీత్యా వాడికి కాబోయే భార్య జాతకం ఎలా వుంటుందో నాకు తెలుసు. మా అబ్బాయి మీ అమ్మాయిని నచ్చి పెళ్లికి సిద్ధపడ్డాడంటే జాతకాలు ముడిపడినట్టే. మా కాబోయే కోడలి జాతక చక్రం నేను ముందే వేసి వుంచాను. కావాలంటే చూడండి'' అంటూ జేబులోనుండి ఒక జాతకచక్రాన్ని తీసి టేబుల్ మీదనుంచాడు సిద్ధాంతి.

సత్యమూర్తి ముఖంలో ఆశ్చర్యం! ఒక ఉపదేశం పొందుతున్న అనుభూతి. ఒక సత్యాన్ని కనుగొన్న భావం. జాతకం చెప్పే వారికుండాల్సిన అర్హతపట్ల ఒక అవగాహన. అన్నీ ఆయన ముఖంలో ఒక్కసారిగా ద్యోతకమయ్యాయి. తడబడుతూనే టేబుల్‌మీది జాతకాన్ని తీసి చూచాడు. తన జేబులోని అమ్మాయి జాతకాన్ని పోల్చి చూచాడు. అచ్చు ఒకేలా వున్నాయి! అసలుసిసలు జ్యోతిష ప్రతిభకు అప్రయత్నంగా చేతులు జోడించాడు సత్యమూర్తి. ★